దినేశ్వర్ కుటుంబానికి వీహెచ్ పరామర్శ

బన్సీలాల్‌పేట్: కొండపోచమ్మ డ్యామ్‌లో ప్రమాదవశాత్తు మరణించిన దినేశ్వర్ కుటుంబాన్ని సోమవారం మాజీ ఎంపీ వి. హన్మంతరావు పరామర్శించారు. చాచానెహ్రూనగర్‌లోని దినేశ్వర్ ఇంటిని బన్సీలాల్‌పేట్ డివిజన్ అధ్యక్షులు ఐ. చిరంజీవి తదితరులతో కలిసి సందర్శించారు. దినేశ్వర్ తండ్రి కిషన్‌దాస్, తల్లి సుమలతలను ఓదార్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు డాక్టర్ శివకుమార్ లాల్, మల్లికార్జున్ తదితరులు ఉన్నారు.

చెన్నారెడ్డికి ఘన నివాళి



చెన్నారెడ్డి జయంతి వేడుకల్లో పాల్గొన్న మర్రి రవీంద్‌రెడ్డి

లాలాపేట: ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రి మర్రి చెన్నారెడ్డి జయంతి వేడుకలను సోమవారం లాలాపేట లేబర్ అడ్డా వద్ద కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో చెన్నారెడ్డి తనయుడు మర్రి రవీందర్‌రెడ్డి పాల్గొని చెన్నారెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పించారు. కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఎన్. రామ్‌లాల్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆరెకటిక సంఘం జాతీయ నాయకులు ప్రేమ్‌లాల్, హరిలాల్, ఆటో శ్రీనివాస్ తదితరులున్నారు.

ఆత్మరక్షణకు కరాటే శిక్షణ దోహదం



చిన్నారులను అభినందిస్తున్న బేగంపేట కార్పొరేటర్ టి.మహేశ్వరిశ్రీహరి..

సనత్‌నగర్: ఆత్మరక్షణకు కరాటే శిక్షణ ఎంతగానో దోహదం చేస్తుందని బేగంపేట కార్పొరేటర్ టి.మహేశ్వరి శ్రీహరి అన్నారు. బేగంపేట డివిజన్ పాటిగడ్డలోని జీహెచ్‌ఎంసీ కరాటే శిక్షణ కేంద్రంలో శిక్షణ పొందుతూ ప్రతిభను చాటుతున్న చిన్నారులను ఆమె అభినందించారు. కోచ్ చందుముదిరాజ్ ఆధ్వర్యంలో చిన్నారులు కార్పొరేటర్‌ను కలిసి వసతుల కల్పనతో పాటు అవసరమైన సరిపడా పరికరాలను అందజేయాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. దీనికి స్పందించిన కార్పొరేటర్ క్రీడాకారులకు అవసరమైన పరికరాలు అందజేసేందుకు కృషి చేస్తానన్నారు.

శాకాంబరిగా శారదాంబ

భక్తి శ్రద్ధలతో చండీ హోమం



నల్లకుంట: ధనుర్మాసం పౌర్ణమిని పురస్కరించుకొని సోమవారం నల్లకుంట శంకరమఠానికి భక్తులు పోటెత్తారు. ఈ సందర్భంగా ఉదయం శక్తి గణపతికి ఆది పూజలు గావించిన అర్చకస్వాములు, చంద్రమౌళీశ్వర స్వామికి విశేష పూజలు చేశారు. అలాగే లోకమాత శారదాంబను పట్టువస్త్రాలు, పూలమాలలు, వివిధ రకాల కాయగూరలతో అలంకరించగా శాకాంబరిగా దర్శనమిచ్చారు. అనంతరం మఠం ప్రాంగణంలోని యాగశాలలో వేద పండితుల మంత్రోచ్ఛారణల నడుమ చండీహోమం నిర్వహించారు. ఈ సందర్భంగా నవ ధాన్యాలు, సుగంధ ద్రవ్యాలు, అమ్మవారికి సమర్పించే నూతన వస్త్రాలు, గాజులు హోమంలో వేసి ఆవు నెయ్యితో పూర్ణాహుతి గావించారు. అనంతరం చండీ పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనగా, భక్తులకు ప్రసాద వితరణ గావించి అన్నదానం చేశారు.

సమయాన్ని వృథా చేయొద్దు



కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న విప్ ఆది శ్రీనివాస్

ఉస్మానియా యూనివర్సిటీ: విద్యార్థులు సమయాన్ని వృథా చేయకూడదని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. సోమవారం ఓయూ జేఏసీ కేలండర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 2025 కొత్త సంవత్సరంలో విద్యార్థులు తమ లక్ష్యాన్ని చేరుకొని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆశించారు. కార్యక్రమంలో ఓయూ జేఏసీ చైర్మన్ కొత్తపల్లి తిరుపతి, రాజేందర్, శ్రీనివాస్, ప్రశాంత్, రాజు, శ్రీకాంత్, దేవదాస్, రవి తదితరులు పాల్గొన్నారు.



మోడల్‌కాలనీలో భోగి మంటల వేడుకలో సారిపల్లి కొండల్‌రావు



బేగంపేట కుందన్‌బాగ్ అపార్ట్‌మెంట్స్‌లో భోగి వేడుకల్లో హైదరాబాద్ రెడ్‌క్రాస్ యూత్ కన్వీనర్ మణిదీప్ తదితరులు

సంక్రాంతి.. మన సంస్కృతి

సనత్‌నగర్: తెల్లవారకముందే 'భోగి మంటలతో సంక్రాంతి పండుగకు ప్రజలు స్వాగతం పలికారు. పల్లె సంస్కృతికి అద్దం పట్టేలా అపార్ట్‌మెంట్ల ముందు రంగురంగుల ముగ్గులు వేసి గొబ్బెమ్మలు చేసి పూలతో అలంకరించారు. సనత్‌నగర్ ఎస్‌ఆర్‌టీకాలనీ, అశోక్‌కాలనీ, జెక్‌కాలనీ, సుందర్‌నగర్‌కాలనీ, మోడల్‌కాలనీ, సంజీవరెడ్డినగర్, అమీర్‌పేట్, బేగంపేట్, రాంగోపాల్‌పేట్, బన్సీలాల్‌పేట్, పద్మారావు నగర్ తదితర ప్రాంతాల్లో సంక్రాంతి పండుగ వేడుకల్లో జనం మునిగితేలారు. ఇళ్లలో పిండి వంటలు చేసుకుని ఆరగించారు. చిన్నా పెద్దా తారతమ్యం లేకుండా గాలిపటాలను కీంచ్ (దారాన్ని లాగడం) కొట్టడంలో బిజీగా కనిపించారు.

- జెక్‌కాలనీలో ఉన్న పలు అపార్ట్‌మెంట్ అసోసియేషన్ల ఆధ్వర్యంలో భోగి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉదయాన్నే భోగి మంటలు వేసి పండుగను ఆహ్వానించారు. చిన్నారులకు భోగి పండ్లు పోసి ఆశీర్వచనాలు అందించారు. పలు ఇళ్లలో బొమ్మల కొలువు ఏర్పాటుచేశారు.
- బేగంపేట కుందన్‌బాగ్ అపార్ట్‌మెంట్స్‌లో ఉదయమే భోగి మంటలు వేసి పండుగకు స్వాగతం పలికారు. ఈ వేడుకల్లో మణిదీప్ రెడ్‌క్రాస్ యూత్ కన్వీనర్, మణిదీప్ ఛారిటబుల్ ట్రస్ట్ అధినేత మణిదీప్ పాల్గొన్నారు.
- మోడల్‌కాలనీలో జరిగిన వేడుకల్లో కాలనీ అధ్యక్షుడు సారిపల్లి కొండల్‌రావు, ఉపాధ్యక్షుడు జేఎస్‌టీ శాయి తదితరులు పాల్గొన్నారు. బీజేపీ సీనియర్ నేత వెల్లాల రామ్మోహన్ కార్యాలయం వద్ద జరిగిన వేడుకల్లో రామ్మోహన్‌తో పాటు డివిజన్ అధ్యక్షుడు కృష్ణచైతన్య, అఖిలాష్‌రెడ్డి, ఆనంద్‌కృష్ణ, సోను, శ్రీకాంత్‌యాదవ్, రవి చిటుకుల, రాజేంద్రచారి, శ్రీనివాస్, సీతంరాజు, హరిబాబు, తుషార్, రిత్విక్, అశోక్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



భోగి మంటల కార్యక్రమంలో వెల్లాల రామ్మోహన్



లాలాపేటలో ఇంటి ముందు రంగవల్లులను తీర్చిదిద్దుతున్న మహిళలు

నిర్మానుష్యంగా రహదారులు..

సంక్రాంతికి ఎక్కువ శాతం కుటుంబాలకు సొంతూర్లకు వెళ్ళడంతో సోమవారం రోడ్లన్నీ బోసిపోయాయి. ఎప్పుడూ సాఫ్ట్‌వేర్ కోర్సుల కోచింగ్‌తో హడావిడిగా ఉండే అమీర్‌పేట్ ప్రాంతం పెద్దగా జన సంచారం లేక వెలవెలబోయింది.

- ట్రాఫిక్‌తో వాహనదారులను ఉక్కిరిబిక్కిరి చేసే అమీర్‌పేట్ మైత్రీవనమ్ చౌరస్తా, ఎస్‌ఆర్‌నగర్, ఎర్రగడ్డ, బేగంపేట్ రహదారులు ఖాళీగా దర్శనమిచ్చాయి. విద్యార్థులతో సందడిగా ఉండే మైత్రీవనమ్–సత్యం థియేటర్ రోడ్డు విద్యార్థుల హడావిడి లేక మూగబోయింది.

18న త్యాగరాజ స్వామి ఆరాధనోత్సవం

నల్లకుంట: శ్రీ సరస్వతి సంగీత విద్యాలయం ఆధ్వర్యంలో ఈ నెల 18వ తేదీన శ్రీ త్యాగరాజ స్వామి 178వ ఆరాధనోత్సవం, సరస్వతీ సంగీత విద్యాలయం 69వ వార్షికోత్సవం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని సంగీత విద్యాలయం అంబర్‌పేట సంగీత సిస్టర్స్ యశస్విని, తేజస్వినులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బాగ్ అంబర్‌పేటలోని షిర్డీ సాయిబాబా ఆలయంలోని ధ్యాన మందిరంలో ఆ రోజు సాయంత్రం 5 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. దీనికి ముఖ్య అతిథులుగా టీవీ దర్శక–నిర్మాత శోభా శంకర్, ప్రముఖ వీణా విద్వాంసురాలు మల్లాది శాంతామూర్తి హాజరవుతారన్నారు. ఈ సందర్భంగా ముందుగా ప్రార్థనా గీతం ఉంటుందని అనంతరం చిన్నారులు హిరణ్య, భావన, హితాంష్, సూర్యతేజ, దివిజ, శ్రీవిద్య, శ్రీకర్, విదీష, సాయి, చేతన్‌శర్మ, గాయత్రి, శ్రావణి, ప్రణీత, సాయి శ్రేయాస్, తేహిత, అభిగ్నలచే ఉత్సవ సంప్రదాయ కీర్తనలు ఉంటాయని చెప్పారు. అనంతరం సంగీత విద్యాలయం ప్రిన్సిపాల్, వీణా గానరత్న పోపూరి శ్రీనివాస శర్మ స్వీయ పర్యవేక్షణలో పంచరత్న కీర్తనల గానం ఉంటుందని తెలిపారు. ఇందులో యశస్విని, వాసుకీదేవి, అరుణశ్రీ, విజయ్ కృష్ణ, రఘురాం తదితరులు పంచరత్న కీర్తనలు ఆలపిస్తారని చెప్పారు. అలాగే సంగీత విద్యాలయం విద్యార్థులచే స్వామివారి అష్టోత్తర పూజ ఉంటుందన్నారు. సంగీతాభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

రేపటితో ముగియనున్న 'వింటర్ ఉత్సవ్ మేళా'

ఖైరతాబాద్: పీపుల్స్ ప్లాజా వేదికగా ఆకట్టుకుంటున్న వింటర్ ఉత్సవ్ మేళా ఈ నెల 15తో ముగుస్తుందని నిర్వాహకులు మిర్జా రఫీక్‌బేగ్ తెలిపారు. సంక్రాంతి సందర్భంగా నగరవాసులు ఆహ్లాదంగా గడిపేందుకు వింటర్ ఉత్సవ్ మేళా మంచి వేదిక అని, కుటుంబ సమేతంగా ప్రతి ఒక్కరు మేళాలో ఆహ్లాదంగా గడపవచ్చని తెలిపారు. నెలరోజుల పాటు నగరవాసులను ఆకట్టుకున్న వింటర్ ఉత్సవ్ మేళా 15వ తేదీతో ముగుస్తుందన్నారు. ఈ సంక్రాంతిని సాగరతీరంలో ఆహ్లాదంగా జరుపుకునేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. భోగి సందర్భంగా సోమవారం మేళాకు భారీగా సందర్శకులు తరలివచ్చారు.

మంత్రి దామోదర్ రాజనర్సింహ ప్రత్యేక పూజలు



రామలింగేశ్వరస్వామిని దర్శించుకున్న మంత్రి దామోదర రాజనర్సింహ



బేగంపేట కట్టమైసమ్మ ఆలయంలో చండీహోమంలో పాల్గొన్న భక్తులు

సనత్‌నగర్: రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ సోమవారం బేగంపేట ప్రకాష్‌నగర్ రామలింగేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఆయనకు ఆశీర్వచనాలు అందించారు. మంత్రితో పాటు సోదరుడు రామచందర్ కూడా ఉన్నారు. ఈ పూజా కార్యక్రమాల్లో చంద్రమోహన్ విడియాలతో పాటు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కట్టమైసమ్మ ఆలయంలో చండీహోమం..

బేగంపేట కట్టమైసమ్మ ఆలయంలో చండీ హోమం అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ ట్రస్టీ చైర్మన్ చెక్కల సుభాష్‌ముదిరాజ్‌తో పాటు ఆలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఐఐఎంసీ కళాశాలకు స్వయం ప్రతిపత్తి హోదాపై హర్షం

ఖైరతాబాద్: ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అండ్ కామర్స్ కళాశాల అటానమస్ స్టేటస్ (స్వయం ప్రతిపత్తి) సాధించి 2025–26 విద్యా సంవత్సరం నుంచి అకాడమిక్ ఎక్సలెన్స్‌లో అడుగు పెడుతోందని కళాశాల ప్రిన్సిపాల్ కూర రఘువీర్ తెలిపారు. ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అండ్ కామర్స్ కళాశాల 1973లో వంద మంది విద్యార్థులతో ప్రారంభమై ఇప్పుడు 17వందల మంది విద్యార్థులకు చేరుకుందని, 2023లో 3వ సైకిల్‌లో 3.27 స్కోర్ సాధించి ఎన్‌ఎసీచే ఎప్లస్ గ్రేడ్‌తో గుర్తింపు పొందిందని కళాశాల ప్రిన్సిపాల్ కూర రఘువీర్ తెలిపారు. యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ 2025–26 విద్యా సంవత్సరం నుంచి 10 సంవత్సరాల కాలానికి ఐఐఎంసీ కళాశాలకు స్వయం ప్రతిపత్తి హోదా లేఖను అందుకోవడం సంతోషంగా ఉందన్నారు.

సందడిగా 'హిందూ పబ్లిక్ స్కూల్ వార్షికోత్సవం'




హిందూ పబ్లిక్ స్కూల్ విద్యార్థుల సాంస్కృతిక నృత్యాలు..




బహుమతులు ప్రదానం చేస్తున్న ఈటల రాజేందర్, మర్రి శశిధర్‌రెడ్డి..

సనత్‌నగర్: హిందూ పబ్లిక్ స్కూల్ 37వ వార్షిక వేడుకలు ఘనంగా జరిగాయి. సనత్‌నగర్, చింతల్, బాలానగర్, ఏజీకాలనీ బ్రాంచ్‌లకు చెందిన విద్యార్థుల ఆటపాటలతో ఉత్సవ వేదిక హోరెత్తింది. భారతీయతను తట్టిలేపేలా త్రివర్ణ డ్రెస్సులతో విద్యార్థులు చేసిన సాంస్కృతిక నృత్యాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. సినీగీతాలకు లయబద్ధంగా వేసిన స్టెప్పులు ఆహుతులను ఓలలాడించాయి. మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యుడు ఈటల రాజేందర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడలకు తగిన ప్రాధాన్యతనివ్వడం ద్వారా నూతనోత్తేజం అలవడుతుందన్నారు. మాజీ ఎమ్మెల్యే మర్రి శశిధర్‌రెడ్డి, బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు గౌతమ్‌రావు, పీఎస్‌ఎం స్కూల్ చైర్మన్ సీహెచ్. హనుమంతరావు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీగోదా రంగనాథుల కల్యాణోత్సవం



సెవన్‌టెంపుల్స్‌లో శ్రీగోద రంగనాథుల కల్యాణ మహోత్సవం..



గోదాదేవి కల్యాణోత్సవ దృశ్యం

సనత్‌నగర్: ధనుర్మాసంలో నిర్వహించే శ్రీగోదా రంగనాథుల కల్యాణ మహోత్సవం సనత్‌నగర్ హనుమాన్ దేవాలయం (సెవన్ టెంపుల్స్) ప్రాంగణంలోని శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో వైభవంగా జరిగింది. ఈఓ సత్యనారాయణ పర్యవేక్షణలో ప్రధాన అర్చకులు పరాశరం రవీంద్రాచార్యుల ఆధ్వర్యంలో జరిగిన శ్రీగోదా రంగనాథుల కల్యాణాన్ని భక్తులు వీక్షించి తరించారు. అర్చకులు రిపుంజయశర్మ, సిబ్బంది శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

చిలకలగూడ: సీతాఫల్‌మండి శ్రీనివాసనగర్ శ్రీగిరి ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో గోదాదేవి కల్యాణోత్సవం సోమవారం కనులపండువగా జరిగింది. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించుకుని, తీర్థప్రసాదాలు స్వీకరించారు. మంగళవారం మకరసంక్రాంతి పర్వదినం సందర్భంగా అభిషేకం, మకర సంక్రమణపూజ తదితర ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్ష, ఉపాధ్యక్షులు బసవరాజు శ్రీనివాస్, వేణుగోపాలరావు తెలిపారు.

గంజాయి తరలిస్తున్న యువకుడి రిమాండ్



వివరాలు వెల్లడిస్తున్న జీఆర్‌పీ డీఎస్‌పీ జావెద్

సికింద్రాబాద్: గంజాయి తరలిస్తున్న ఓ యువకుడిని పోలీసులు అరెస్టు చేశారు. జీఆర్‌పీ డీఎస్‌పీ ఎస్‌ఎన్ జావెద్ కథనం ప్రకారం ... పశ్చిమబెంగాల్ రఘునాథ్‌గంజ్ ప్రాంతానికి చెందిన షేక్ కొడక్‌బాక్స్ (26) కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తుంటాడు. రెండేళ్ల క్రితం గంజాయి వినియోగానికి అలవాటు పడ్డాడు. డబ్బు కోసం గంజాయి విక్రయదారులతో పరిచయం పెంచుకుని, గంజాయి రవాణా చేసేందుకు ఒప్పందం కుదుర్చుకున్నాడు. ఒడిశాలో షేక్ కొడక్‌బాక్స్ అక్కడ 6 కిలోల గంజాయిని కొనుగోలు చేశాడు. అక్కడి నుంచి విశాఖ ఎక్స్‌ప్రెస్ రైలు ద్వారా సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌కు చేరుకున్నాడు. మరో రైలు ద్వారా ముంబై వెళ్లేందుకు ప్లాట్‌ఫామ్‌పై వేచిచూస్తున్న షేక్ కొడక్‌బాక్స్‌ను రైల్వే పోలీసులకు పట్టుకున్నారు. 6 కిలోల గంజాయి స్వాధీనం చేసుకొని కేసులు నమోదు చేసిన రైల్వే పోలీసులు నిందితుడిని రిమాండ్‌కు తరలించారు. గంజాయి రవాణాకు సూత్రధారులైన అలీఖాన్, జాయ్‌లపై కేసులు నమోదు చేసి వారి ఆచూకీ కోసం గాలింపు చర్యలు ప్రారంభించినట్లు డీఎస్‌పీ జావెద్ తెలిపారు.

మందా జగన్నాథంకు ఘన నివాళి



మందా జగన్నాథంకు నివాళులర్పించిన నాయకులు

పద్మారావునగర్: మాజీ ఎంపీ మందా జగన్నాథం సంతాప సభ సోమవారం సాయంత్రం రాణిగంజ్ చౌరస్తాలో నిర్వహించారు. మాదిగ హక్కుల అభివృద్ధి పార్టీల సంఘాల ఐక్యత జేఏసీ నాయకులు ఎస్.ఆర్ మల్లేష్, మాతంగి గణేష్, బండి శ్రీనివాస్ అధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వక్తలు మందా జగన్నాథం చేసిన సేవలను కొనియాడారు. ఆయన మరణం దళిత వర్గాలకు తీరని లోటని పేర్కొన్నారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు కుర్మ లక్ష్మీపతి, కె. శంకర్, అడ్వకేట్ మల్లికార్జున్, పుల్లూరి మహేందర్, డి. వేణుగోపాల్, కుర్మ మహేందర్, బొడ్డు మహేష్, మాచర్ల ప్రభాకర్, జి. జగదీష్, పి. చంద్రశేఖర్(బబ్బర్), దర్శనం కుమార్, తాళ్ల సాగర్ పాల్గొన్నారు.

బీసీల చైతన్యానికి అధ్యాపకులు కృషి చేయాలి

అంబర్‌పేట: బీసీల చైతన్యానికి అధ్యాపకులు బాధ్యత తీసుకోవాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య కోరారు. బీసీల ఉద్యమం, వారి అభ్యున్నతికి విద్యావంతులు ముందుకురావాలని ఆయన పిలుపునిచ్చారు. నూతనంగా ఏర్పడిన తెలంగాణ బీసీ లెక్చరర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం కాచిగూడలో ఓ హోటల్‌లో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆర్.కృష్ణయ్య విచ్చేసి మాట్లాడారు. బీసీ విద్యార్థులు, యువతకు మార్గనిర్దేశం చేసే బాధ్యత అధ్యాపకులపై ఉంటుదన్నారు. బీసీ ఉద్యోగుల్లో పదోన్నతులపై అన్యాయం జరుగుతుందని దీనిపై ప్రభుత్వాల దృష్టికి తీసెకెళ్లి న్యాయం చేసేందుకు కృషి చేస్తానన్నారు. 50 ఏళ్లుగా బీసీల ఐక్యతా, వారి సమస్యలపై పోరాడుతునే ఉన్నానని, ప్రస్తుతం బీసీల్లో కాస్త ఐక్యత, చైతన్యం కనిపిస్తుందన్నారు. కార్యక్రమంలో లెక్చరర్ల అసోసియేషన్ అధ్యక్షులు కె.సుదర్శన్ మాట్లాడుతూ బీసీ అధ్యాపకులు ఐక్యత, సమస్యల పరిష్కారం కోసం తమ అసోసియేషన్ పనిచేస్తుందన్నారు. బీసీ భావజాల వ్యాప్తికి తాము అంతా పాటుపడుతామన్నారు. అనంతరం అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నూతన సంవత్సర కేలండర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మామిడి విఠల్, బీసీ సంక్షేమ సంఘం నాయకులు గుజ్జ కృష్ణ, గుజ్జ సత్యం, నందగోపాల్, సుధాకర్, పృథ్వీ, ఉదయ్, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక రైళ్లను నడపాలి

లిబర్టీ: హైదరాబాద్ మహానగరం నుంచి కుంభమేళాకు వెళ్లే భక్తుల కోసం ప్రత్యేక రైళ్లను నడిపితే భక్తులకు ఎంతో మేలు కలుగుతుందని సనాత ధర్మ పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు పుట్టి యాదగిరి ముదిరాజ్ అన్నారు. ప్రయాగ్‌రాజ్ కుంభమేళా జరగనున్న నేపథ్యంలో హైదరాబాద్ నగరం నుంచి లక్షలాదిమంది భక్తులు వెళ్లే అవకాశం ఉన్నందున రైల్వే శాఖ అధికారులు చర్యలు చేపట్టాలని సోమవారం ఒక ప్రకటనలో కోరారు. ఫిబ్రవరి 26వ తేదీ వరకు జరిగే కుంభమేళా దృష్టిలో ఉంచుకొని రైల్వే అధికారులు ముందస్తు ప్రత్యేక రైళ్ల నడిపి భక్తులకు సహకరించాలని అన్నారు. హైదరాబాద్ మహానగరం నుంచే కాకుండా తెలంగాణలోని 33 జిల్లాల నుంచి భక్తులు ప్రయాగ్‌రాజ్‌కు వెళ్తారని ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు చొరవ చూపాలని ఆయన రైల్వే అధికారులను కోరారు.